క్లుప్తంగా

శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రంలో మార్పులు తగవు

మలికిపురం: ప్రభుత్వం జారీ చేస్తున్న కుల ధ్రువీకరణ పత్రంలో శెట్టిబలిజకు బదులు గౌడ (శెట్టిబలిజ) అని రావడాన్ని శెట్టిబలిజ సంఘాలు ఆందోళన చెందుతున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాటి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మలికిపురంలో మాట్లాడుతూ శెట్టిబలిజల ఆత్మాభిమానం దెబ్బతినకుండగా బీసీ–బీ(శెట్టిబలిజ) అని క్యాస్ట్ సర్టిఫికెట్‌లో వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సుమారు 20 ఏళ్ల క్రితం కూడా ఇటువంటి వివాదమే రావడంతో అప్పటి ప్రభుత్వం యూ టర్న్ తీసుకుందన్నారు.

నిధుల దుర్వినియోగం

అంబాజీపేట: ఆదర్శ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం కావడంతో కనీస వసతులు మృగ్యమయ్యాయని గంగలకుర్రుకు చెందిన నెల్లి వెంకట రమణ తెలిపారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గంగలకుర్రు గుంటమామిడితోట ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు రూ.12 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఈ నిధులు దుర్వినియోగం కావడంతో పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరుగుదొడ్లు, బాత్ రూములు లేవని, తాత్కాలిక మరుగుదొడ్డికి తలుపు లేకపోవడంతో కర్టెన్‌ను తలుపుగా వినియోగిస్తున్నారన్నారు. నిర్మాణానికి తీసుకువచ్చిన సిమెంట్ గడ్డ కట్టిందని, టైల్స్, వాటర్ పైపులు నిరుపయోగమయ్యాయని తహసీల్దార్ బి.చినబాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే పనులను పూర్తి చేయాలని రమణ కోరారు.

శ్రీనివాసరావుకు సత్కారం



పెనికేరులో సాగునీటి సంఘ అధ్యక్షుడు గారపాటిని సత్కరిస్తున్న రైతులు

ఆలమూరు: చింతలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావును రైతులు ఘనంగా సత్కరించారు. పెనికేరులో ఉన్న ముసలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి వివిధ గ్రామాలకు చెందిన రైతులు పూలమాలలు వేసి, దుశ్శాలువ కప్పి, మెమెంటోను బహూకరించి సన్మించారు. మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు కాలువను అభివృద్ధి చేసి శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందించిన గారపాటిని వారు అభినందించారు. ఖరీఫ్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని గారపాటి రైతులకు హామీ ఇచ్చారు.

కంటి వైద్య శిబిరం



పలివెలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపేట: పలివెల ప్రధాన వీధిలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు విన్నకోట వీఎస్ఎన్ మారుతీ బంగారం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్వాతి, డాక్టర్ ఇందు, దివ్య, చందన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 90 మంది పరీక్షలు చేయించుకున్నారు. కొందరికి కళ్లజోడు ఆవశ్యకత ఏర్పడగా 50 శాతం రాయితీపై అందజేశారు. కొంతమందిని ఆపరేషన్ కోసం జీఎస్ఎల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విన్నకోట ఫణి రాఘువేంద్రరావు, నాగరత్నాజీరావు, గొలకోటి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



వైద్యానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.16 వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. కాకినాడకి చెందిన వజ్రపు భాగ్యరమ(15) ఊపిరితిత్తులు 60 శాతం పాడైపోయి ప్రాణాపాయ స్థితిలో ఉంది. తండ్రి మృతి చెందడంతో తల్లి ఒక కిరాణా షాప్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నారు. ప్రతి నెలా ఇల్లు గడవడమే కష్టమైన వీళ్లకి వైద్యం చేయించుకునే స్తోమత లేక శ్రీకాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో భాగ్యరమ తల్లి ధనలక్ష్మికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.16 వేలు చెక్కును అందజేశారు.

రహదారి అభివృద్ధే లక్ష్యం

అంబాజీపేట: ప్రజా అవసరాలకు ఉపయోగపడే గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం భూమి పూజ చేశారు.

సాగుకు కసాయం

- ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి
- కషాయాల వినియోగంపై ఆసక్తి
- రసాయనాలతో పోల్చితే ఖర్చు తక్కువ
- డ్రోన్లతో పిచికారీ



అగ్ని అస్త్రం కషాయాన్ని తయారు చేస్తున్న రైతులు

రావులపాలెం: వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. ఎరువుల అధికంగా వాడడంతో నేల తన స్వాభావిక స్వభావం కోల్పోవడంతోపాటు పెట్టుబడులు కూడా విపరీతంగా పెరిగిపోయింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడి లేని వ్యవసాయం లేదా ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ప్రతి ఏటా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. మొదట్లో రైతులు మొగ్గు చూపకపోయినప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాగు విధానం ద్వారా పంట దిగుబడి పెరగడం, నేల స్వభావం మారడం, పెట్టుబడి ఖర్చుల తగ్గడాన్ని స్వీయ అనుభవం ద్వారా గుర్తిస్తున్న రైతులు సాగులో ప్రకృతి విధానాలను అనుసరించేందుకు ముందుకు వస్తున్నారు.

భూసారం పరిరక్షణ

ప్రకృతి సాగు విధానంలో నేల స్వాభావికతను కాపాడడంతోపాటు, భూసారం కోల్పోకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెడుతోంది. పంటకు ముందు నవధాన్యాలను చల్లి భూసారాన్ని పెంచడం మొదలుకుని దిగుబడిని పెంచేందుకు, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను అధికంగా చేసేందుకు ప్రస్తుతం అనేక కషాయాలను ఈ విధానంలో వినియోగిస్తున్నారు. ఇందులో పలు కషాయాలు అత్యంత ఘాటుగా ఉండి వినియోగించేటప్పుడు రైతులు ఇబ్బంది పడేవారు. అయితే అందుకు కూడా ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. డ్రోన్ సాయంతో కషాయాలను పంటలపై స్ప్రే చేస్తున్నారు. రైతుకు కష్టం తప్పడంతోపాటు ప్రకృతి ప్రసాదించిన వస్తువులనే సాగులో వినియోగిస్తుండడం ప్రస్తుతం బాగా పెరిగింది.

పంటలపై పిచికారీ

తూటికాడ కషాయం, చేప వ్యర్థాల నుంచి తయారు చేసిన కషాయం, ఇంగువ కషాయం వంటి వాటిని పంటలపై వినియోగిస్తున్నారు. ముఖ్యంగా వరి పంటపై ఈ కషాయాల వినియోగం ద్వారా స్పష్ట మైన మార్పును గుర్తిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించినప్పటికీ పంట ఆరోగ్యంపై రైతులకు ఎప్పుడూ ఆందోళగానే ఉండేది. అయితే ప్రకృతి సాగు విధానంలో వినియోగిస్తున్న కషాయాలు చల్లిన తర్వాత పంట ఆరోగ్యంలో స్పష్టంగా మార్పు కన్పించడాన్ని రైతులు గుర్తిస్తున్నారు. దీంతో తోటి రైతులు కూడా వీటి వినియోగానికి ఆసక్తి చూపిస్తున్నారు.

తక్కువ ఖర్చు

వరి పంటను ఏవైనా తెగుళ్ల ఆశిస్తే, వాటిని నివారించేందుకు వాడే రసాయన పురుగు మందుల కొనుగోలుకు రైతులకు వేల రూపాయలు ఖర్చయ్యేవి. అయితే అవే తెగుళ్లను అడ్డుకునేందుకు ప్రకృతి సాగు విధానంలో డ్రోన్ ద్వారా కషాయాలను పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల వందల రూపాయల ఖర్చుతోనే స్పష్టమైన మార్పు కన్పిస్తోందని రైతులు చెబుతున్నారు.

ఆలమూరు మండలం చొప్పెల్ల, నర్సిపూడి తదితర గ్రామాల్లోని దాదాపు 1,500 ఎకరాల్లో ఈ ప్రకృతి సాగు విధానాన్ని రైతులు అనుసరిస్తున్నారని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. ఆత్రేయపురం మండలంలో పేరవరం, రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు, ర్యాలీ, అంకంపాలెం ఆరు గ్రామాలు, రావులపాలెం మండలంలో దేవరపల్లి, ఈతకోట, కేతరాజుపల్లి, రావులపాడు పూరేటి వారి చెరువు గ్రామాలు, కొత్తపేట మండలంలో వానపల్లి, బిళ్లకుర్రు గ్రామాల్లో దాదాపు 1,785 ఎకరాల్లో ప్రకృతి సాగు జరుగుతున్నట్టు సంబంధిత అధికారులు చెపుతున్నారు. వీటిలో వరి, అరటి, కొబ్బరి, కూరగాయలు, పూలతోటలు కూడా సాగు అవుతున్నట్టు చెప్పుతున్నారు.



కషాయాన్ని డ్రోన్‌లో వేస్తున్న సిబ్బంది



వరి పంటపై కషాయాన్ని పిచికారీ చేస్తున్న డ్రోన్

కషాయాలు ఇవే

ఆకులపై కాండం తొలిచే పురుగు గుడ్లను పొదగనీయకుండా వేపగింజల కషాయాన్ని పిచికారీ చేస్తున్నారు. దీనిలో పాల ఇంగువను జోడించడం ద్వారా సిలీంద్ర నాశినిగా, చేప, బెల్లం ద్రావణం కలపడం ద్వారా పైరుకు పోషకాలు అందించడానికి తోడ్పడుతుంది. వరిపైరు నాటిన 20–45 రోజుల్లో రెండు సార్లు దీన్ని పిచికారీ చేయాలి.

చిన్న పురుగు నుంచి పెద్ద పురుగు వరకు అన్నింటినీ నాశనం చేసేందుకు అగ్ని అస్త్రం వినియోగిస్తారు. కాండం తొలిచే పురుగును నశింపజేస్తుంది. 3 గ్రోత్ ప్రమోటర్స్‌గా చేప బెల్లం, కోడిగుడ్డు నిమ్మ రసం, పంచగవ్య ఈ మూడింటిలో ఏదో ఒకటి స్ప్రే చేయాల్సి ఉంటుంది. పొట్ట దశలో ఒకసారి, ఈనిక తరువాత చల్లాలి. వీటి ద్వారా దిగుబడితోపాటు, గింజల నాణ్యత కూడా పెరుగుతుంది.

కషాయాలతో మంచి మార్పు



ప్రకృతి సాగు విధానాన్ని మూడు పంటలుగా అనుసరిస్తున్నాను. రసాయనిక ఎరువులు, పురుగు మందులతో పోలిస్తే కషాయాలతోనే ఎక్కువ మార్పు కనిపిస్తోంది. పంట ఆరోగ్యంగా ఉండడంతో పాటు దిగుబడి కూడా బాగుంటుంది. ఖర్చు కూడా తక్కువగా అవుతోంది.

– మద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, రైతు, నర్సిపూడి

పంట ఆరోగ్యం



ఇంగువ వేప గింజల కషాయం, అగ్ని అస్త్రం, చేప బెల్లం కషాయాలను పంటపై వివిధ దశల్లో పిచికారీ చేయడం వల్ల పంట ఆరోగ్యం మెరుగుపడుతోంది. రసాయన పురుగు మందులతో పోలిస్తే ఖర్చు భారీగా తగ్గుతోంది. వీటితో వివిధ దశల్లో వచ్చే పురుగులు, దోమను సమర్థవంతంగా నివారించవచ్చు.

– షేక్ రసూల్, రైతు, నర్సిపూడి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

మలికిపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలికిపురం ఎస్సై పీవీఎస్ఎస్ సురేస్ పేర్కొన్నారు. రామరాజులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు నిర్మూలన, శక్తి యాప్‌లపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్ , ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోకుండా విద్యపైనే శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రావూరి రాజా రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బలక్ష్మి, బంగారు రాజు, బేతినీడి శ్రీనివాస్, యేపుగంటి వెంకట పద్మనాభం, ముత్యాల సుబ్రహ్మణ్యం, సుబ్బరాజు, శ్రీనివాస్, అమ్మాజీ, గణేష్‌బాబు, శ్రావణ్‌కుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.

మండపేటలో రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు

ఆలమూరు: రాష్ట్ర స్థాయి 49వ టెన్నికాయిట్ పోటీలను మండపేట వేదికగా నిర్వహించనున్నట్టు జిల్లా టెన్నికాయిట్ సంఘ అధ్యక్షుడు ముత్యాల బాల మురళీకృష్ణ తెలిపారు. గుమ్మిలేరులో సోమవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో మండపేటలోని వేగుళ్ల సూర్యారావు క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించనున్నామన్నారు.

ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

- ఆర్డీఓ శ్రీకర్
- పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై డివిజన్ కమిటీ సమీక్ష



కొత్తపేటలో సమీక్షిస్తున్న ఆర్‌డీఓ శ్రీకర్

కొత్తపేట: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని స్థానిక ఆర్డీఓ పీ శ్రీకర్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ(పీసీపీఎన్‌డీటీ) చట్టం అమలు డివిజన్ కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ, చట్టం అమలు కమిటీ చైర్మన్ శ్రీకర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భధారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ లింగ వివక్షతను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశమన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ అయినా, మగ అయినా ఒకటే అనే భావన భార్యాభర్తల్లో కలగాలన్నారు. ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్స్ గర్భస్థ లింగ నిర్ధారణ కోసం ఉపయోగిస్తే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నేరమని, చట్టాన్ని ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తారని హెచ్చరించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సెక్రటరీ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎం.సుమలత, సభ్యులు సీడీపీఓ ఏ గజలక్ష్మి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ అన్నపూర్ణ, ఎస్సై జీ సురేంద్ర, వైద్య సిబ్బంది కాశిన శేషు తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

అంబాజీపేట: వినాయక చవితి ఉత్సవ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానంలో అనుమతులు మంజూరు చేస్తామని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులకు వినాయక చవితి మండపాల ఏర్పాటు, నిర్వహణ, చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ అనుమతులకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నిర్వాహకులు విధిగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి ఉత్సవాల నిర్వహణకు అనుమతి లిఖిత పూర్వకంగా పొందేలని మండప నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. దరఖాస్తు చేయగానే సంబంధిత పోలీసు అధికారి ఆ గ్రామంలో ఆ ప్రాంతాన్ని తనిఖీ చేసి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ జారీ చేస్తారని దానిని పరిశీలించాలన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు.

అయినవిల్లి: ఏ విధమైన రణగణధ్వనులు లేకుండా ప్రశాంత వాతవరణంలో చవితి ఉత్సవాలను జరుపుకోవాలని తహసీల్దార్ కె.విద్యాపతి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చవితి ఉత్సవాలను ప్రభుత్వం నింబధనలు మేరకు నిర్వాహించాలన్నారు. చవితి ఉత్సవాలకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు.



అంబాజీపేటలో మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

ఉత్సవాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు

కొత్తపేట: వినాయక చవితి పండగను పురస్కరించుకుని నిర్వహించే నవరాత్రుల సందర్భంగా ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సూచించింది. ఆ మేరకు ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే జనార్దన నాయుడు జారీ చేసిన సూచనల ప్రకటనను స్థానిక అధికారులు సోమవారం పత్రికలకు విడుదల చేశారు.

- చవితి పండుగ సందర్భంగా భారీ ఎత్తుగా ఉండే వినాయకుడి విగ్రహాలు కొనుగోలు చేసి ట్రాక్టర్లు తదితర వాహనాలపై మండపాలకు తీసుకువెళ్లే సమయంలో కొన్ని ప్రదేశాల్లో ఎలక్ట్రికల్ వైర్లు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వినాయకుడి మండపాలకు నిర్వాహకులు టెంపరరీ ఎలక్ట్రికల్ సర్వీసు కనెక్షన్ తీసుకోవాలి.
- గణపతి మండపాల దగ్గర నిర్వాహకులు సీరియల్ లైట్స్, డెకరేషన్స్ చేసేటప్పుడు ఎలక్ట్రికల్ వైర్లకు జాయింట్ల వద్ద టేప్ సరిగా వేయాలని, లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
- విగ్రహాల నిమజ్జనం ఊరేగింపులో టెంపరరీ లైటింగ్ ఏర్పాటు చేసుకునే సమయంలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

నరసన్న సన్నిధిలో మాజీ మంత్రి వేణు



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్ర పటం అందుకుంటున్న మాజీ మంత్రి వేణు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో సోమవారం మాజీ మంత్రి సీహెచ్ వేణు గోపాలకృష్ణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ అందజేశారు. అలాగే వినుకొండ ఎమ్మెల్యే జి.వెంకట శివ సీతారామాంజనేయులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనకూ స్వామిచిత్ర పటాన్ని అందజేశారు.

ఆస్పత్రి భవనం నిర్మించండి

అంబాజీపేట: ముక్కామలలో ప్రాథమిక ఆరోగ్య భవనం లేక పోవడంతో రోగులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారని, పక్కా భవనం నిర్మించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఎంపీపీ వెంకటేశ్వరరావుతోపాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుమప్రియ, నాయకులు బండారు మల్లిబాబు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం పీహెచ్‌సీ పాత భవనం డిస్పెన్సరీలో ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడం ఇబ్బందిగా ఉందన్నారు. ఈ పీహెచ్‌సీకి 10 గ్రామాలకు ప్రజల వైద్య సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌మాధవ్ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

మామిడికుదురు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా కోనసీమ జిల్లా పర్యటనకు వస్తున్న రామ్‌మాధవ్ సభకు మామిడికుదురు నుంచి సోమవారం పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పార్టీ జెండాలు ప్రదర్శిస్తూ మోటారుసైకిళ్లపై ర్యాలీగా అమలాపురం పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ, పార్టీ నేతలు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీ



పెదపట్నంలంకలో మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేస్తున్న యువకులు



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణ కోరుతూ పెదపట్నంలంక గ్రామానికి చెందిన యువకులు సోమవారం 600 మందికి మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న వినాయక మంటపాల వద్ద వాటిని పంపిణీ చేశారు ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోసం మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలకు పూజ చేయాలన్నారు. కార్యక్రమంలో యేడిద రాజేష్, పినిశెట్టి లీల, పైడిపర్తి రవితేజ, యేడిద సురేంద్ర, కామిరెడ్డి దుర్గారావు, గిడుగు బాలాజీ, గుండుపల్లి నారాయణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: శృంగవరప్పాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేశారు. హెచ్‌ఎం కె.శ్రీదుర్గ పర్యవేక్షణలో విద్యార్థులు వీటిని తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు.

రావులపాలెం: స్థానిక పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అసోయేషన్ సభ్యులు వీటిని పంపిణీ చేశారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు. తహసీల్దారు ముక్తేశ్వరరావు, ప్రముఖులు జి.సతీష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ల ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని ఆరు చోట్ల ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఏ రాజు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆధార్ సెంటర్లు ఏర్పాటులో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందులో భాగంగా ఆధార్ సేవలపై శిక్షణ పొందిన డీఏలు ఉన్న ఆరు చోట్ల ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీంతో మడికి-2, చెముడులంక-1, జొన్నాడ-2, ఆలమూరు-2, నర్శిపూడి, సంధిపూడిలో అందుబాటులోకి వచ్చిన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయం వద్ద చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. సోమవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గ భవాని ఆలయంలో ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు ఆమె పరిశీలించారు. ఆలయంలో ఆలయ ధ్వజ స్తంభాలకు, ఆలయ ప్రాకారానికి ఏర్పాటు చేస్తున్న పూల డేకరేషన్‌ను, ఫొటో షూట్ కోసం ఏర్పాటు చేస్తున్న పుష్పాల అలంకరణను ఆమె పరిశీలించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎల్.గన్నవరంలో కలుసుకున్న 1994-95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

పి.గన్నవరం: లంకల గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. వృత్తి, వ్యాపారాల రిత్యా దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులంతా 30 ఏళ్ల తర్వాత ఇక్కడికి చేరుకున్నారు. వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులను వాట్సాప్ గ్రూప్ ద్వారా ఇక్కడికి చేరుకునేలా చేసిన వట్టం రామచంద్రశేఖర్, పొదలాడ శ్రీనివాసరావులను అభినందించారు.

వరదకు ఉధృతికి దెబ్బతిన్న రహదారి

మామిడికుదురు: అసలే అధ్వానంగా ఉన్న రోడ్డు. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు. ఇదీ అప్పనపల్లి నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి. గోరుచుట్టుపై రోకలి పోటులా గోదావరి వరద ఆ రోడ్డును మరింత దారుణంగా మార్చేసింది. గోదావరి వరద ఉధృతికి అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలు మరింత పెద్దవయ్యాయి. దీంతో పాటు శిథిలమైన అప్పనపల్లి కాజ్‌వే మరింతగా కృంగిపోయింది. పాశర్లపూడి వైపు కాజ్వే రక్షణ గోడ స్వల్పంగా దెబ్బతింది. దీంతో ఇక్కడి పరిస్థితి దారుణంగా మారింది. వీటిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్డుతో పాటు కాజ్వేను ఆధునీకరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వీటి అభివృద్ధిపై తక్షణం దృష్టి సారించాలని కోరుతున్నారు.



వరద ఉధృతికి అధ్వానంగా ఉన్న అప్పనపల్లి రోడ్డు

తేరుకుంటున్న లంక గ్రామాలు

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. మండలంలోని పలు లంక గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద పూర్తిగా తగ్గడంతో సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ గ్రామ ప్రజలు కాజ్‌వేపై నడచి వెళ్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతోపాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, అనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు మాత్రం ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంక భూముల్లోని పంటలన్నీ వరద నీట మునిగి పాడైపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



వరద ముంపు నుంచి బయటపడ్డ కనకాయలంక కాజ్‌వే

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం: నరేంద్రపురం సబ్‌స్టేషన్ నుంచి పి.గన్నవరం వరకూ కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు. జి.పెదపూడి, ఊడిమూడి, ఆయా గ్రామాల పరిధిలోని లంక ప్రాంతాలు, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, నరేంద్రపురం, కుందాలపల్లి, పప్పులవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు వివరించారు.

క్షయపై అవగాహన

సఖినేటిపల్లి: క్షయ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంతర్వేది కర గ్రామంలో రామేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో టీబీ రహిత భారత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సూరజ్ పిలుపు నిచ్చారు. రెండు వారాలు మించి దగ్గు, కళ్లె లేదా రక్తం పడడం , ఆకలి మందగించడం, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందని సంప్రదించాలని ఆయన కోరారు. ఈ మేరకు స్థానికులు 30 మంది నుంచి పరీక్షల కోసం కళ్లెను సేకరించినట్టు ఆయన అన్నారు.

రేవులో రాకపోకలు యథాతథం

సఖినేటిపల్లి: మండలంలో సఖినేటిపల్లి, నర్సాపురం రేవులో సోమవారం పంటు రాకపోకలు యథాతథంగా ప్రారంభమయ్యాయి. ఇటీవల వరద ఉధృతి నేపథ్యంలో మూడు రోజులుగా అధికారులు రాకపోకలను నిలుపుదల చేశారు. రేవులో వరద గోదావరి శాంతించడంతో రాకపోకలు తిరిగి మొదలయ్యాయి.